విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 04, మార్చి 2025

సైనికులలకు ఉచిత వైద్య సేవలు

పుట్టుకతో వినికిడి లోపం ఉన్నవారికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స

ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో "వీర సైనికునికి వందనం" పేరిట సైనికులకు, సైనికుల కుటుంబాలకు నంద్యాల ఐఎంఏ వైద్యుల ఆసుపత్రులన్నిటిలో నిరంతర ఉచిత వైద్య సేవా కార్యక్రమాన్ని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లాంచనంగా ప్రారంభించారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం, సైనికులకు సేవా కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంగా నంద్యాల ఐఎంఏ అధ్య క్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, గౌరవ అతిథులుగా టిడిపి రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధుమణి ఆసుపత్రి చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు డాక్టర్ చిత్తలూరి మణిదీప్ పుట్టుకతో వచ్చే వినికిడి సమస్య కు తమ ఆసుపత్రిలో చేసే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సల గురించి వివరించారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నంద్యాల వైద్యులు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లలో పనిచేస్తున్న సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఓపిడి సేవలు అందించ దానికి ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లి నంద్యాల స్ఫూర్తి గా దేశవ్యాప్తంగా వైద్యులు ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించడానికి కృషి చేస్తామన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పుట్టుకతో వినికిడి లోపం ఉన్నవా రికి రూ.8లక్షలు విలువచేసే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు మధుమణి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్ నంద్యాలలో 150 మందికి చేయడం అభినందనీయమన్నారు. ఆసుపత్రులలో ప్రదర్శించే ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలతో కూడిన వాల్ పోస్టర్లను డాక్టర్ బైరెడ్డి శబరి, ఎన్ఎండి ఫయాజ్,డాక్టర్ రవికృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ సహదేవుడు,డాక్టర్ నాగమణి, డాక్టర్ మాధవి, డాక్టర్ మణిదీప్, డాక్టర్ కార్తీక్ డాక్టర్ పెసల సునీత, ఆడియాలజిస్ట్ మస్తానయ్య, అధిక సంఖ్యలో కాక్లియర్ ఇంప్లాంట్ సస్చర చికిత్సలు చేయించుకున్న బాలలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగులకు సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు చక్రాల సైకిళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వికలాంగ లబ్ధిదారులకు వీల్ చైర్ లను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వికలాంగులకు వీల్ చైర్లు, దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌లను కలెక్టర్ పంపిణీ చేసారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వీల్ చైర్ కావాలని దరఖాస్తు చేసుకున్న ఐదు మంది వికలాంగుల లబ్ధిదారులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో వీల్ చైర్ 8000 రూపాయల విలువగల 5వీల్ చైర్లను ఐదు మంది వికలాంగ లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. అలాగే ఆరు మంది దివ్యాంగ విద్యార్థులకు 30 వేల రూపాయల విలువ చేసే ల్యాప్ ట్యాప్‌లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఇకనుండి వీల్ చైర్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వీల్ చైర్ లను ఇంటి వద్దనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వికలాంగుల సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన కోసం సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతోందని, అన్ని మండలాలలో కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవా లని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కృషి చేస్తానని జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

తాగునీటి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయండి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ వేసవిలో త్రాగునీటి ఎద్దడినిని ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళిక రూపొందించి ఆ మేరకు బోర్ వెల్స్ డీపనింగ్, ఫ్లషింగ్, పైప్ లైన్ల మరమ్మత్తులను చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేపట్టిన పి4 సర్వే 15 శాతం పెండింగ్లో ఉందని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్లో ఉన్న 38 శాతం ఎంఎస్ఎంఈ సర్వేతో పాటు వర్క్ ఫ్రం హోం, మిస్సింగ్ ఎంప్లాయిస్,మిస్సింగ్ సిటిజన్ హౌస్ హోల్డ్ డేటా, చైల్డ్ ఆధార్ అప్డేట్ తదితర సర్వేలన్నీ నిర్ణీత కాల వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. సిరివెళ్ల మండలంలో అన్ని పారామీటర్ల సర్వేలో వెనుకబడి ఉందని పనితీరు మెరుగుపరుచుకుని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఖచ్చితంగా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.పరీక్షల సమయంలో పిల్లల ఆరోగ్యం సరిగా చూసుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని అందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్బన్ పొడితో సతమతం

పరిసర ప్రాంతాలలో పెరుగుతున్న కాలుష్యం

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కన పరిసర ప్రాంతాలలో కార్బన్ పొడి కాలుష్యం కమ్మేస్తున్నది. కొందరు ఇష్టానుసారంగా విషపూరితమైన నల్లటి కార్బన్ పొడిని రవాణా చేస్తూ చుట్టుపక్కల ప్రాంతాలను విషపూరితం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా అక్రమార్కులు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే మండలంలని సిమెంట్ పరిశ్రమల నుండి వెలువడుతున్న కాలుష్యము, వేస్టేజ్ సంస్థ నుండి వెలువడుతున్న విషయవాయివులు, అక్రమ మైనింగ్ వల్ల పకృతి విధ్వంసంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా ఉన్నారు. అనారోగ్యం బారిన పడుతున్న కాపాడేవారు లేకుండా పోతుండడంతో మండలమే నివాస యోగ్యానికి పనికిరాకుండా పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. గ్రామ సమీపంలో రెండు చోట్ల కార్బన్‌పొడి రవాణా జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుండి విష కార్బన్ ను బ్యాగుల ద్వారా ఇక్కడికి తీసుకువచ్చి ఆతర్వాత పొడిని లారీ ట్యాంకర్లకు నింపుకొని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ తరలిస్తున్నారు. పొడిని రవాణా చేసే కాంట్రాక్టర్ సిమెంట్ పరిశ్రమ ప్రాంతంలో ఏర్పాటు చేసుకోకుండా ఇక్కడ ఏర్పాటు చేసుకున్నారు. కార్బన్ పొడిని ట్యాంకర్లలో నింపుతున్నప్పుడు చుట్టుపక్కల పొడి పడి కాలుష్యం అవుతున్నది. వర్షాలు పడితే ఆ పొడి అంతా నీటిలో కలిసి జల కాలుష్యం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయం చేస్తాం..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఇన్చార్జి ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నంద్యాల అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలిచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ ఆదేశించారు.

మా భాష మృతదేహానికి నివాళి

విశాలాంధ్ర- నంద్యాల అర్బన్ : నంద్యాల జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ ఒంటెద్దు బండి వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మాభాష సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు మాభాష మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపి ఏఐటీయూసీ మా భాష కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కే.ప్రసాద్, ఏఐటీయూసీ నంద్యాల పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, ఒంటెద్దు బండ్ల వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఏలియా, యూనియన్ నాయకులు, ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం నివాళులు అర్పించారు.

హోంగార్డులను ఏపీకి బదిలీ చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలంగాణలో పనిచేస్తున్న హోంగార్డులను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు కలెక్టర్ రాజకుమారి గనియకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేల మంది హోంగార్డులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హోంగార్డులుగా సెలెక్ట్ అయి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలోనే ఉండి పోవాల్సి వచ్చిందని, వారంతా అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను వారి స్థానికతను బట్టి మార్చడం జరిగిందని కానీ హోంగార్డులను మాత్రం మార్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోంగార్డులు తెలంగాణలో పనిచేస్తుండగా వారి కుటుంబాలు ఇక్కడే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొంతమంది హోంగార్డుల పిల్లలు తెలంగాణలోనే చదువుకుంటున్నారని వారు భవిష్యత్తులో స్థానికతను కోల్పోవలసి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారని, 11సంవత్సరాలుగా సొంత రాష్ట్రానికి రావాలని వారు తాపత్రయపడినా ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం బాధాకరమని, తెలంగాణ ప్రభుత్వం బదిలీలకు అభ్యంతరం లేదని ప్రకటించినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని వారు పేర్కొన్నారు. హోంగార్డులకు మద్దతుగా అఖిల భారత యువజన సమాఖ్య ఉంటుందని వారు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు మార్కెట్ ప్రసాద్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్స వాలు మార్చి 3నుంచి ఆరంభం కానున్నాయి. ఇందులో భాగంగా 46 వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ నియమానుసారం శ్రీకార్యం పద్మనాభచారియన్ సూచనలతో మేనేజర్ మురళీధరన్ ఆదేశాలతో మార్కెట్ ప్రసాద్‌ను సోమవారం ఏవో సుదర్శన్ స్వయంగా ఇంటికి వెళ్లి ఆహ్వానించారు. అనంతరం మార్కెట్ ప్రసాద్ మాట్లాడుతూ అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి మరియు శ్రీ అహోబిల మఠం 46వ పీఠాధిపతి వారి అనుగ్రహం నాకు లభించిందని మార్కెట్ ప్రసాద్ అన్నారు. అహోబిలం బ్రహ్మోత్సవం - 2025 ఆహ్వన పత్రాన్ని సుదర్శన్ స్వామి (మనియమ్ ధార్/అడ్మినిస్ట్రేషన్) పవిత్ర హస్తాల నుండి స్వీకరించే సౌభాగ్యం కలిగిందన్నారు. అహోబిలం బ్రహ్మోత్సవాలకు సరిపడు కూరగాయలు నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా పూర్తిగా అందించడం జరుగుతుందన్నారు. అహోబిలం బ్రహ్మోత్సవాలకు ప్రతి సంవత్సరం మార్కెట్ ప్రసాద్ కూరగాయల వితరణ చేస్తున్న విషయం విధితమే.

మొక్కలు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - బండి ఆత్మకూర్ : మండలం పెద్ద దేవలాపురం గ్రామంలో శ్రీశైలం నియోజకవర్గం రామలింగారెడ్డి టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు సందర్భంగా కేక్ కట్ చేసి సచివాలయం దగ్గర మొక్కలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దన్న, కృష్ణారెడ్డి కంచర్ల మనోహర్ చౌదరి,ఈశ్వర్ రెడ్డి,కృష్ణ నాయక్, దే రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,జూటూరు సర్పంచ్,ఎలగల రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మహాశివరాత్రి ఆదాయం రూ.58 లక్షలు

విశాలాంధ్ర - మహానంది : ఆరు రోజుల పాటు మహానంది క్షేత్రంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలా సందర్భంగా రూ.58లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు సోమవారం ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈఓ మాట్లాడుతూ గతదాది రూ.56.లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.2లక్షలు ఆదానంగా వచ్చినట్లు చెప్పారు. ఆందరి సహకారంతో ఘనంగా శివరాత్రి వేడుకలను నిర్వహించమన్నారు. అన్ని శాఖల అధికారులు సహకరించరన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు వేదపంధితులు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

రాజగోపురం నుంచి జారిపడి యువకుడు మృతి

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి క్షేత్రంలో అపశృతి చోటు చేసుకుంది. బ్రహ్మోత్సవాలు అనంతరం రాజగోపురంకు లైటింగ్ కొరకు అమరిచిన విద్యుత్ తీగలను తొలగిస్తుండగా చాగలమర్రి మండలం పెద్ద భోదనం గ్రామానికి చెందిన మాదిగ నరేంద్ర 23 సంవత్సరాలు రాజగోపురం నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు బనగానపల్లె ఏరియాప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ముళ్లపొదల తొలగింపు

విశాలాంధ్ర - రుద్రవరం : మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న చెరువు కట్టలపై ఉన్న ముళ్లపొదలను తొలగించేం దుకు రూ.14 లక్షల నిధులు మంజూరైనట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ రఘురాం తెలిపారు.సోవవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 16 చెరువులు ఉన్నా యన్నారు. ఇందులో 11చెరువులకు కట్టలపై ముళ్లపొదలను తొలగిం చేందుకు రూ.14 లక్షల కేంద్ర ప్రభుత్వనిధులు మంజూరు అయ్యాయ న్నారు. ఇందులో కొండమాయపల్లి చిన్నరాజు చెరువు, బి నాగిరెడ్డిపల్లి చెరువులపై ముళ్ళ పొదల తొలగింపు పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు.

ప్రమాద స్థల పరిశీలన

విశాలాంధ్ర-చాగలమర్రి : పట్టణంలోని పాత బస్టాండ్‌లో ప్రమాదవశాత్తు పూల అంగళ్ళు దగ్ధమైన విషయం తెలిసిందే. సోమవారం ఈ ప్రమాద స్థలాన్ని ఈఓపిఆర్‌డి,మేజర్ గ్రామ పంచాయితీ కార్యనిర్వహణాధికారి తాహీర్‌హుసేన్, టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌బాషలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో గ్రామ పంచాయితీ స్థలంలో గత కొన్ని ఏళ్ళుగా ఏర్పాటు చేసుకున్న పూల అంగళ్ళు దగ్ధమయ్యాయని,ఈ ప్రభుత్వ స్థలం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి ఈ స్థలంలో ప్లాట్ పారమ్ లేదా పక్కా రూముల నిర్మాణాలు చేపట్టే విషయమై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.కార్యక్రమం లో పంచాయతీ సిబ్బంది,టిడిపి నాయకులు కొలిమి హుసేన్ వలి,మౌలాలి,హనీఫ్,అగ్ని ప్రమాద బాధితులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భంగా ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమము నందు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, యాగంటిపల్లె ఉప ఉప సర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, అర్చకులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై కలెక్టరేట్ ముట్టడి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లె నుండి ర్యాలీగా బయలుదేరి వందలాది మంది మున్సిపల్ కార్మికులు,మహిళలతో కలిసి ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు అధ్యక్షతన కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.శివ బాలకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో చర్చించి ఏఐటియుసి కార్మిక సంఘంతో చర్చలు జరిపి న్యాయమైన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రంగంలో కాంట్రాక్టు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని రావడానికి సన్నద్ధమవుతుందని దినిని ఉపసంహరించుకొని మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అనేక సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న పిఎఫ్, ఈఎస్ఐ సమస్యను పరిష్కరించి సమాన పనికి సమాన వేతనం, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.35 వేలకు పెంచి, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాల అమలు చేసి మున్సిపల్ కార్మికులు విధులలో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని గత శాసనసభ ఎన్నికల కన్నా ముందు జరిగిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను పరిష్కరించాలని మున్సిపల్ రంగంలో కాంటాక్ట్ విధానం రావడం వలన కాంట్రాక్టర్‌కు బానిసగా కార్మికులు ఉండవలసి వస్తుందని శ్రమ దోపిడీ జరుగుతుందని కార్మికుల జీవితాలకు భద్రత ఉండదని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ నెల 11వ తారీఖున చలో విజయవాడ సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి సిద్ధం కావాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి పూను కోవాలని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఓబులేసు, నంద్యాల మున్సిపల్ యూనియన్ నాయకులు రంజిత్, ప్రతాప్, ఆత్మకూరు మున్సిపల్ యూనియన్ నాయకులు బిసన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివరాం, మస్తాన్, ఎస్తేరమ్మ మస్తానమ్మ, లలితమ్మ, చిన్నమ్మ దానిమ్మ, జయమ్మ , మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సై నాగ కీర్తనను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - వెలుగోడు : పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివిన నాగ కీర్తన సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. వెలుగోడు మండలం గుంత కందాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వ్యవసాయ పనులు చేసుకుంటూ తన కూతురును ఉన్నత చదువులు చదివించారు. నాగ కీర్తన 10వ తరగతి వరకు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు విద్యను అభ్యసించారు. ఇప్పుడు సబ్ ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు. తన కుమార్తె దిగ్విజయంగా అనంతపురం నందు పోలీసు శిక్షణ కళాశాల లో ప్రాదమిక శిక్షణ పూర్తి చేసుకొని, కడప జిల్లాకి సబ్ ఇన్స్పెక్టర్గా నియమించబడడం సంతోషదాయకమని తండ్రి అన్నారు. తమ పాఠశాలలో చదివి ఎస్సైగా ఎంపిక కావడం గొప్ప విషయం అని,మిగతా బాలికలు కూడా నాగ కీర్తనను స్ఫూర్తిగా తీసుకొని ఉజ్వల భవిష్యత్తు పొందాలని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ అన్నారు. ఎంఈఓ తో పాటు మండల రిసోర్సెస్ సిబ్బంది తండ్రి కూతుళ్ళను మండల రిసోర్స్ పర్సన్ భవనము నందు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి మిఠాయి తినిపించి జ్ఞాపికను అందజేశారు. కుటుంబ సభ్యులు ,గ్రామస్థులు అభినందించారు.

పంట కాలువలో విద్యుత్ ఉత్పత్తి

విశాలాంధ్ర - పాములపాడు : ఇదివరకు భూమిలో నుండే విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్న పరిస్థితి ఉంది కానీ,చక్రం ద్వారా పంట కాలువలో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు అనే అంశంపై సన్నవర్ జర్మనీ కంపెనీ సీఈవో, ఫౌండర్ శివ రఘురాం చెన్నుపాటి, డైరెక్టర్ బద్రీనాథ్‌లు పరిశోధించినట్లు తెలిపారు. శివ రఘురాం బృందం ఆదివారం ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆవుల నారాయణరెడ్డి వారి సతీమణి బానకచర్ల సర్పంచ్ ఆవుల జయసుధ వారి ప్రోత్సాహంతో చక్రం ద్వారా పంటకాలలో విద్యుత్ ఉత్పత్తి(హైడ్రో టర్బిన్ ప్రొఫైల్ ప్రాజెక్ట్) ప్రయోగాన్ని ఈ కంపెనీ వారు వెలుగోడు సమీపంలోని పంట కాలువలలో చక్రాన్ని అమర్చి ప్రయోగాన్ని చేశారు. ఈ ప్రయోగంలో విద్యుత్ ఉత్పత్తి బల్బులు వెలగడంతో ప్రయోగం పూర్తిగా విజయవంతం అయింది. అనంతరం బానకచెర్ల గ్రామంలో పారిశ్రామికవేత ఆవుల నారాయణరెడ్డి స్వగృహమునందు ప్రాజెక్టు భాగస్వామ్యులు మేఘనాథ్ రెడ్డితో కలిసి శివ రఘురాం, బద్రీనాథ్ లు మీడియాతో మాట్లాడారు ఇదివరకు భూమిలో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది కానీ చక్రం ద్వారా నీటిలో, గాలిలో విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని పరిశోధించడం జరిగిందని అన్నారు. కానీ వాటిని ఎక్కడ ప్రయోగాత్మకంగా మేము చూడలేదన్నారు మొట్టమొదటిగా పాములపాడు మండలంలోని ఈ ప్రాంతంలో ఆవుల వెంకట నారాయణరెడ్డి సహకారంతో ప్రయోగం చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని భారత దేశ ప్రభుత్వం ముందట ఉంచామన్నారు ఎలాంటి చర్చలు లేకుండా వారు అంగీకరించి 2023 లో జరిగిన పూణే, అమృత సార్‌లలో 20సదస్సులకు ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రొఫెసర్ కామకోటి గారికి తెలియపరచడం జరిగిందన్నారు, ఆయన ఏపీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఐటీ మెడ్రాస్ ద్వారా ప్రాజెక్ట్ చేయడం జరుగుతుందన్నారు . ఏపీ గవర్నమెంట్ కోస్తా, ప్రాంతాలలో కాలువ గట్ల మీద గాలిలో విద్యుత్ ఉత్పత్తి చేయడం వాటిని ఆహ్వానిస్తుందన్నారు. ఈ విద్యుత్ ఉత్పత్తి రైతుకు అగ్రికల్చర్ కు సొంత ఇంటికి ఎక్కడైనా పర్వతాలలో అయినా గాలి ద్వారా నీటి ప్రవాహం ద్వారా ఎలాంటి డ్యామ్ లేకుండా చక్రం ద్వారా విద్యుత్తుపై చేయొచ్చు అన్నారు మేము చేసిన ప్రయోగం చిన్నపాటిదన్నారు ఒక రోజుకు 24 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు, ఈ విద్యుత్తును నేషనల్ హైవే బ్రిడ్జిలకు,ఇళ్లకు అగ్రికల్చర్ కు వినియోగించుకోవచ్చు అన్నారు మరిన్ని చక్రాలను నీటి ప్రవాహ కాలువ గట్ల పైన వినియోగించుకుంటే ఒక గ్రామానికి కూడా వినియోగించుకోవచ్చు అన్నారు. రైతులకు ప్రజలకు సులువంగా తక్కువ ఖర్చులో విద్యుత్తు వినియోగించుకోవచ్చని ఇదే కాక నేవీలో కూడా పడవలో కూడా చక్రం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ప్రయోగం చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలోనే ఏ.వి.ఎన్ రెడ్డి సహకారంతో చేస్తామన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 04, మార్చి 2025

క్యాన్సర్ హాస్పిటల్‌లో ఖాళీలను భర్తీ చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో– కర్నూలు : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యానర్స్ వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ భాషకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.మునెప్ప మాట్లాడుతూ కర్నూలులో క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, గతంలో క్యాన్సర్ పేషెంట్లు ఇక్కడ వైద్యం లేక పేద క్యాన్సర్ పేషెంట్లు తిరుపతి, చెన్నై, బెంగళూరు లాంటి నగరాలకు వైద్యం కొరకు పోయేవారన్నారు. కర్నూల్లోనే క్యాన్సర్ హాస్పిటల్ పెట్టడం వల్ల తెలంగాణ, కర్ణాటక, ఏపీలోని కర్నూలు జిల్లా పేషెంట్లకు అధునాతన పరికరాలతో క్యాన్సర్ వైద్యం అందులో అందుబాటులోకి తేవడం సంతోషమన్నారు. తక్షణమే క్యాన్సర్ హాస్పిటల్‌కు శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ ఎఫ్ఎన్‌వోలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

నాటుసారాను నిర్మూలించాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: కర్నూలు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే.. నవోదయం 2.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని, ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటుసారాను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ప్రొహిబిషన్ మరియూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం నవోదయం 2.0పై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని, నాటుసారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాను, రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి సరఫరా వంటి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెం :14405కు కాల్ చేసి తెలియజేసి జిల్లాను నాటుసారా రహితంగా మార్చడంలో తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ వెంకట నారాయణమ్మ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఇంద్రకరణ్ తేజ, హెడ్‌కానిస్టేబుల్ సాయి బాబా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దుకాణదారుడిదే బాధ్యత: కమిషనర్

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : నగరంలో దుకాణాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత వ్యాపారస్తుడిదే బాధ్యత అని, వారిపై కఠిన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు హెచ్చరించారు. సోమవారం తెల్లవారుజామునే ఆయన పాతబస్తీ, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల వద్ద అపరిశుభ్రంగా ఉండటం వల్ల అనారోగ్యం పాలవుతారని, ప్రతి వ్యాపారస్తుడు తమ దుకాణం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా చెత్తకుండీలు ఉండాలని, రహదారులపై చెత్తచెదారం ఉండరాదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

ల్యాప్ టాప్‌లు పంపిణీ

విశాలాంధ్ర–కర్నూలు: పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ల్యాప్ టాప్ లను అందచేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆరు ల్యాప్ టాప్ లను కలెక్టర్ విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేసిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల కొరకు ల్యాప్ టాప్ లను మంజూరు చేస్తోందన్నారు.. ఒక్కొక్క ల్యాప్ టాప్ దాదాపుగా 58 వేల రూపాయలు ఉంటుందన్నారు. ఆత్మ విశ్వాసంతో జీవితంలో ఉన్నత స్థానం చేరుకునేందుకు కృషి చేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

336 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 20506 దరఖాస్తు చేసుకోగా, 20160 పరీక్షకు హాజరయినట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పదిమంది విద్యార్థులు బుక్ అయినట్లు తెలిపారు.

అక్రమ అరెస్టును ఖండించిన సీపీఐ

విశాలాంధ్ర – ఆదోని క్రైం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న ప్రజా నాయకుడు జీవీ సత్య నారాయణ మూర్తిని అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, రైతు సంఘం నాయకులు ఎల్లప్ప విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిని అరెస్టు చేసి, రిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు.

చిత్తశుద్ధి ఉంటే సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి బసాపురం గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రైతుల పండించిన ఎండుమిర్చి ధర పూర్తిగా పడిపోయిందని క్వింటాల్‌కి రూ.25 వేల మద్దతు ధర ప్రకటించాలని కోరారు. వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతి రైతుకు రూ.10వేల పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో భీమన్న, అంజిత్ గౌడ్, రమేష్, తమ్మిరెడ్డి, ఈరన్న తదితరులు ఉన్నారు.

ఘనంగా ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర – ఓర్వకల్లు : మండల పరిధి లోని నన్నూరు గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ మాతా మారెమ్మ దేవాలయ ద్వాజ స్థంభ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామ పెద్దలు మాతా మారెమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా అమ్మవారికి విశేష పూజలు హోమము నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించి, తమ మొక్కులు తీర్చుకొన్నారు. టీడీపీ బీసీ సెల్ నాయకులు తలారి విజేయుడు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నా ప్రసాద వితరణచేశారు. తహశీల్దార్ విద్యాసాగర్ ఎంపీడీఓ శ్రీనివాసులు టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, క్రిష్ణరెడ్డి, ప్రతాప్ రెడ్డి, షాంశుద్దీన్, దాసరి శేఖర్, సుంకులమ్మ, పూజారి జయ్యన్న గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం : మునెప్ప

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు. ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నాక నుద్దేశించి మునెప్ప మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగం, సామాజిక భద్రత, కార్మికులకు జీతాలు చెల్లింపు, మున్సిపల్ శాఖకు బాధ్యత అప్ప చెప్పాలని పర్మినెంట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డీఏ, అరియర్స్‌ను లీవ్ఎన్ క్యాష్ మెంట్ డబ్బులు చెల్లించాలన్నారు. కనీస వేతనం 36 వేలు రూపాయలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, చనిపోయిన మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తెలుగుదేశం, జనసేన ,బిజెపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార న్నారు. తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కారం కొరకు మున్సిపల్ శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వాధికారులు కార్మిక నాయకులను పిలిపించి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకపోతే ఆరో. తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాములు, అయ్యరాజు, ఏసన్న, సవారి, సంజీవులు, శేఖర్, భాస్కర్, లక్ష్మన్న, తిమ్మప్ప, అంజి, రాధ, ఏఐటీయూసీ నాయకులు ఆర్.కృష్ణారెడ్డి, మల్లన్న, రాము, నాగరాజు, పురుషోత్తం, మహిళా నాయకు రాలు రబిజాబీ, వెంకటేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీఎస్‌లో పని చేస్తున్న హోంగార్డులను ఏపీకి బదిలీ చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర – కర్నూలు : తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోంగార్డులను వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు బీసన్న, నగర నాయకులు సూర్య మధు, శ్రీనులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు చెందిన చెందిన వేలాదిమంది హోంగార్డులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగం పొంది, రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోవాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రం విడిపోయి 11 ఏళ్లు ఉన్న అన్ని శాఖల ఉద్యోగస్తులు ఏ రాష్ట్రానికి చెందినవారు ఆ రాష్ట్రానికి వచ్చినప్పటికీ హోంగార్డ్స్ మాత్రం చాలామంది తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోవలసి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వారు ఉద్యోగాలు తెలంగాణ రాష్ట్రంలో ఉండటంతో అసలే చాలీచాలని జీతాలతో జీవితం వెల్లదిస్తున్న హోంగార్డులకు సొంత రాష్ట్రానికి బదిలీ చేయకపోవడంతో తీవ్ర మానసిక శోభకు గురవుతున్నారన్నారు. పిల్లల చదువుల విషయంలో భవిష్యత్తులో స్థానికత సమస్య ఏర్పడుతుందని తీవ్ర ఆందోళనలో ఉన్నారని కావున రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం హోంగార్డులను ఆంధ్రప్రదేశ్ వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్లో ఉన్న తెలంగాణకు చెందిన హోంగార్డులను వారి స్థానిక రాష్ట్రాలకు బదిలీ చేయాలని వారు కోరారు.

ఆర్టీసీ బస్టాండ్ నందు మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర – దేవనకొండ : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నందు ప్రయాణి కులకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు బి.రవికుమార్, ఎం.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన దేవనకొండ ఆర్టీసీ బస్టాండ్ నందు మౌలిక వసతులు లేక గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు మలమూత్ర విసర్జన కోసం బస్టాండ్‌కి వెళ్తే అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 44 గ్రామాలకు కేంద్ర బిందువైన దేవనకొండ ఆర్టీసీ బస్టాండ్ నందు వసతులు కల్పించాలని గతంలో అనేక మార్లు యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం వల్ల ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. బస్టాండ్లో కూర్చోవడానికి విముఖత చూపడం పరిపాటిగా మారిందన్నారు. యువజన సంఘం నాయకులు మహబూబ్ బాషా, నరేష్, భాస్కర్, వీరాంజనేయులు, రామంజి, కృష్ణ, చాంద్ బాషా, రవికుమార్, మధుబాబు, మిన్నల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ మొయినుద్దీన్‌ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర – కోసిగి : ప్రభుత్వ నిబంధనలు లెక్కచేయని కోసిగి ఇంచార్జ్ ఎంఈఓ మోహినిద్దీన్ సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఈరేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఈరేష్ మాట్లాడుతూ విద్య అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కోసిగి మండలాన్ని ఎంఈఓ మోహినిద్దీన్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా 27వ తేది శనివారం 29 ప్రభుత్వ పాఠశాలలకు సెలవు మంజూరు చేశారని, 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది, మరుసటి రోజు పాఠశాలలకు ఎందుకు సెలవు మంజూరు చేశారని ఎంఈఓలను అడిగితే వారు నిర్లక్ష్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇష్టం లోకల్ హాలిడే ఎప్పుడన్నా ఇచ్చుకోవచ్చు అని మాట్లాడడం సమాజం కాదన్నారు. మండల ప్రత్యేక అధికారి, డీఈఓ స్పందించి ఉపాధ్యాయులపై, ఎంఈఓపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి, పురుషోత్తం, రాము, అశోక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయలచెరువు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామ శివారులో ఉన్న రాయల చెరువు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు కడబూరి, లక్ష్మన్న, మహాదేవలు సోమవారం తహశీల్దార్ కార్యాలయం నందు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ గీతా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాట్ ఫిష్‌లకు ఆహారంగా గ్రామంలో చనిపోయిన శునకం, గొర్రెల, మేకల కళేభరాలను చెరువు యాజమాన్యం అందిస్తున్నారని ఆరోపించారు క్యాట్ ఫిష్ పెంపకంపై నిషేదం ఉన్నా యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. క్యాట్ ఫిష్‌లను తింటే క్యాన్సర్, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై మత్స్యశాఖ అధికారులకు విన్నవించినా చూసిచూడనట్లు వ్యవహరిస్తూ, ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర – ఆదోని క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాశ్వత, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు, స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ నాయకులు ఓబీ నాగరాజ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వంతో కొట్టించుకున్న ఒప్పందంలో భాగంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వైటి భీమేష్, సుదర్శన్, రాజు, జిల్లా సమితి సభ్యులు షేక్షావలి, హుసేని, కార్మిక నాయకులు తిమ్మ గురుడు, విజయేంద్ర, శివ, ఎల్లప్ప, నాగమ్మ, సుశీలమ్మ, శాంతమ్మ, లక్ష్మన్న, జాన్ బాబు, అర్జున్, జయరాజు, షేకన్న, బాష తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ షూటింగ్ బాల్ విజేతలుగా..

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్రం నల్గొండ పట్టణంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు నిర్వహించిన సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్లు విజేతగా నిలిచాయి. సీనియర్ పురుషుల విభాగంలో విజేతలుగా, జూనియర్ బాలుర విభాగంలో బాలుర జట్టు విజేతలుగా నిలిచాయి. సబ్ జూనియర్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానం లో నిలిచాయి. జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలువగా సబ్ జూనియర్ బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచాయి. అన్ని కేటగిరీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ జట్లు గత నాలుగు సంవత్సరాలుగా విజేతలుగా రాణిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. జట్టు విజయానికి కృషి చేసిన శిక్షకులు కిరణ్ కుమార్, మురళి, మహమ్మద్ యూసఫ్ బాష, మల్లికార్జున, హర్షవర్ధన్, సుజాత, సత్య, రేణుకలను ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు

విశాలాంధ్ర – పెద్దకడబూరు: మండల పరిధిలోని బాపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగాభవాని రథోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హనుమంతు, కడబూరి, నరసప్పలు సోమవారం తెలిపారు. ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొనే యజమానులు ఈ నెల 4వ తేదీలోపు రూ.వెయ్యి ప్రవేశ రుసుము చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.27 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.21 వేలు, తృతీయ బహుమతిగా రూ.16 వేలు అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 9989790457,9966025108 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతులు నష్టాల్లో కూరుకపోతున్నారు

విశాలాంధ్ర – హొళగుంద: మండల కేంద్రమైన హొళగుంద, చిన్నాహ్యాటలో రైతు సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ మండల కార్యదర్శి మారెప్పలు సోమవారం వారు మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నుముక అని, వ్యవసాయమే దేశానికి శ్వాస అని, రైతు లేనిదే తిండి లేదన్నారు. వ్యవసాయం మూలన పడిందన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, నష్టాల్లో గొంతుదాకా మునిగిందన్నారు. రైతు అప్పుల్లో పుట్టి అప్పుల్లో పెరిగి అప్పుల్లోనే కాలమవుతున్నాడని, ఎంత ఎక్కువ వ్యవసాయం చేస్తే అంత ఎక్కువ అప్పులవుతున్నాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంలో అనుసంధానం చేయాలని, ఒక్క ఎకరాకు 50 మంది కూలీలు ను ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం భరించాలన్నారు. ఈ కార్యక్రమంలోరైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణయ్య, సీనియర్ నాయకుడు ఇబ్రహీం, కురువ గాదిలింగప్ప, శివమ్మ, కె.సిద్దయ్య, కె.సిద్ధప్ప, మరి స్వామి, హనుమంతు, మల్లికార్జున, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర – సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ హైస్కూల్‌లో చెట్టు విరిగి, కొమ్మలు విద్యార్థుల మీద పడిన ఘటనలో శ్రీలేఖ మృతి పట్ల కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సోమవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, మౌనం పాటించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఘటనపై స్పందించి సోమవారం పాఠశాలకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి డిఈఓ సమ్యూల్ పాల్, ఏపీసీ శ్రీనివాసులులతో కలిసి మృతిచెందిన శ్రీలేఖ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తీవ్ర గాయాపాలైన బాలిక మూడు రోజులు చికిత్స పొంది అనంతరం కోలుకోలేక మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ చిన్న తిమ్మప్ప, అమర్, తదితరులు పాల్గొన్నారు.

ఐదు లక్షలు ఎక్స్‌గ్రేసియా చెక్కు అందజేత : శ్రీలేఖ మృతి పట్ల కుటుంబానికి ధైర్యం చెప్పి తీరని లోటు అని బాధను వ్యక్తం చేశారు. ఎక్స్‌గ్రేషియా కింద రూ.5 లక్షలు చెక్కును అందజేశారు. పాఠశాల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు.కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరం అని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యా, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందని తెలిపారు. అంతకు ముందు ఆడపిల్లను రక్షిద్దాం – ఆడపిల్లను చదివిద్దాం అనే నినాదంతో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీపై జిల్లా కలెక్టర్ సంతకం చేసి, కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్వో వెంకట నారాయణమ్మ, ఐసిడిఎస్ పిడి నిర్మల, జిల్లా అధికారులు కూడా సంతకాలు చేశారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర – కోడుమూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కోడుమూరు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కోడుమూరు కో–లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎపి శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇంటిలోని వ్యక్తులందరూ ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా ప్రజలకు సామాజిక, ఆర్థిక సమస్యలు ఉండవని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల తోపాటు క్యాన్సర్ పరీక్షల కార్యక్రమంలో భాగంగా ప్రతి18 ఏళ్ళు దాటిన మహిళలందరికీ ఉచిత రొమ్ము, నోటి, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. వీటి తోపాటు బిపి,షుగర్ హిమోగ్లోబిన్ పరీక్షలు ఆరోగ్య కార్యకర్తలు ఇంటివద్దకే వచ్చి ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దుర్గాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, హెల్త్ సూపర్వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రభావతిలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

నాటుసారాను నిర్మూలించాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: కర్నూలు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే.. నవోదయం 2.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని, ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటుసారాను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ప్రొహిబిషన్ మరియూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం నవోదయం 2.0పై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని, నాటుసారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాను, రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి సరఫరా వంటి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెం :14405కు కాల్ చేసి తెలియజేసి జిల్లాను నాటుసారా రహితంగా మార్చడంలో తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ వెంకట నారాయణమ్మ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఇంద్రకరణ్ తేజ, హెడ్‌కానిస్టేబుల్ సాయి బాబా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ హాస్పిటల్‌లో ఖాళీలను భర్తీ చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యానర్స్ వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ భాషకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.మునెప్ప మాట్లాడుతూ కర్నూలులో క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, గతంలో క్యాన్సర్ పేషెంట్లు ఇక్కడ వైద్యం లేక పేద క్యాన్సర్ పేషెంట్లు తిరుపతి, చెన్నై, బెంగళూరు లాంటి నగరాలకు వైద్యం కొరకు పోయేవారన్నారు. కర్నూల్లోనే క్యాన్సర్ హాస్పిటల్ పెట్టడం వల్ల తెలంగాణ, కర్ణాటక, ఏపీలోని కర్నూలు జిల్లా పేషెంట్లకు అధునాతన పరికరాలతో క్యాన్సర్ వైద్యం అందులో అందుబాటులోకి తేవడం సంతోషమన్నారు. తక్షణమే క్యాన్సర్ హాస్పిటల్‌కు శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ ఎఫ్ఎన్‌వోలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

ప్రజలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను విస్మరిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ చిలక అనిల్ కుమార్ విమర్శించారు. ఆదివారం రాత్రి ప్రైవేట్ కార్యక్రమానికి కర్నూలు నగరానికి విచ్చేసిన ఆయన కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా అనిల్ కుమార్‌కు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ ఎస్‌సీ బజారన్న సాదరంగా ఆహ్వానించి శాలువతో, పూలమాలతో సన్మానించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, హామీలు ఇచ్చి నేడు వాటిని తుంగలో తొక్కారన్నారు. రంజాన్ నెల సందర్భంగా కుల, మతాలకు అతీతంగా కార్డుదారులకు అందరికీ రంజాన్ తోఫా అందించాలని అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ నవీద్, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వాణిజ్య రంగంలో రాణించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: వాణిజ్య విభాగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వ్యాపార రంగంలో రాణించాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ కేవీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం ట్రేడ్ ఫెస్ట్ 2025 కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు సమావేశాన్ని ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుంచే వ్యాపార మెలుకువలు నేర్చుకోవడం వలన భవిష్యత్తులో ఆర్థికంగా వృద్ధిలోకి రావడానికి ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులలోని వ్యాపార నైపుణ్యాలను ప్రోత్స హించి, పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణం అన్నారు. విద్యార్థులు వివిధ రకాల స్టాల్స్, అందులో రకరకాల వస్తువులను, తినుబండారాలను పెట్టడం, వివిధ ప్రభుత్వ పథకాల గురించి విద్యార్థులు వివరించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.దేవికా రాణి, వాణిజ్య విభాగం, ఇతర విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి క్యాన్సర్ ఉచిత పరీక్షలు

విశాలాంధ్ర - కోడుమూరు : ఇంటింటికి అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తెలిపారు. సోమవారం కోడుమూరు గ్రామ సచివాలయం-1 వద్ద నిర్వహిస్తున్న సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ ప్రతి 18 ఏళ్ళు దాటిన ప్రతి పౌరునికి ఉచితంగా బీపీ, షుగర్, హిమగ్లోబిన్, రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తానన్నారు.ఆరోగ్య కార్యకర్తలు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఇంటి వద్దకే వచ్చి పరీక్ష చేయిస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, హెల్త్ సూపర్వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రభావతి, ఆరోగ్య కార్యకర్త నాగమణి, సంచార చికిత్స కార్యక్రమం సిబ్బంది, ఆశా కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో 104 మంది గైర్హాజరయ్యారు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు గాను మొదటి రోజు జిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షకు మొత్తం 1088 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 984 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 104 మంది గైర్హాజరయ్యారు. ఇరు పరీక్షలకు సంబంధించి మొత్తం 09 పరీక్షా కేంద్రాలకు గాను కర్నూలు 05 మంది సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు 02 పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించారని, ఎలావంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో సోమవారం ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైనట్లు కాలేజ్ ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. పరీక్షలకు 166 మంది విద్యార్థులు హాజరయ్యారని, ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్షలు జరుగుతున్నాయని, పకడ్బందీగా జరుపుతున్నామని అన్నారు.

ఎస్పీని కలిసిన డీసీ చైర్మన్

విశాలాంధ్ర - హొళగుంద: జిల్లా నూతన ఎస్పీగ పని చేస్తున్న విక్రాంత్ పాటిల్‌ను సోమవారం ఎస్పీ క్యాంపు కార్యా లయంలో ఎల్ఐసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-1 చైర్మన్ మిక్కిలి నేని వెంకట శివప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి శాలువా కప్పి, పూల బొకే ఇచ్చి, సన్మానించారు. ఆలూరు నియోజక వర్గంలో శాంతిభద్రతలను కాపా డాలని ప్రజలకు మెరుగైన పోలీసు సర్వీసులు అందించాలని కోరారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : నగర పరిధిలో వివిధ కాలనీలకు సంబంధించి వచ్చే వినతులను సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేసుకొని, ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మస్జిద్‌ల దగ్గర పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసాకు ఎస్డీపీఐ నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు ఎజాస్ హుస్సేన్ వినతిపత్రం అందజేశారు. ప్రార్థన మందిరాల దగ్గర పరిశుభ్రత తూతూ మంత్రంగా కాకుండా పూర్తి బాధ్యత తీసుకొని పరిశుభ్రం చేయండని వారు కోరారు. ఇఫ్తార్ అనంతరం మసీదుల దగ్గర ఉండే చెత్తా చెదారాన్ని పారిశుద్ధ కార్మికులతో ప్రతిరోజు తొలగించాలని, మసీదుల చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్రంగా ఉంచాలని, మున్సిపల్ అధికారులు చెత్త బుట్టలను ఏర్పాటు చేయాలని పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల దగ్గర నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నంద్యాల అసెంబ్లీ ఉపాధ్యక్షులు మజీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కరీముల్లా, కోశాధికారి హనీఫ్, నాయకులు అబ్దుల్ జలీల్ పాల్గొన్నారు.

చెడుస్పర్శ, మంచి స్పర్శలపై అవగాహన సదస్సు

19శాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: చెడుస్పర్శ, మంచి స్పర్శలపై అవగాహన సదస్సు జరిగింది. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఆర్‌బిఎస్‌కే, ఆర్‌కేఎస్‌కే సమన్వయ కర్త డాక్టర్ శైలేశ్ కుమార్ అధ్వర్యంలో చిన్నారులపై లైంగిక దాడుల నివారణపై ఐసీడీఎస్, విద్యా, వైద్య ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమము నిర్వహించినారు. జిల్లా వైద్య మరియుఆరోగ్యశాఖాధికారి పి.శాంతికళ ఈ కార్యక్రమములోముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికలపై జరిగే అఘాయిత్యలను అరికట్టాలంటే పాఠశాల స్థాయి నుంచే మంచి స్పర్శ,చెడు స్పర్శపై బాలికలకు తల్లితండ్రులు అవగాహన కల్పించాలని, ఎదుటి వారు బాలికలతో మాట్లాడుతూ శరీరంలో ఏ ఏ భాగాలను తాకుతూ మాట్లాడుతున్నారో క్షుణ్ణంగా గమనించినప్పుడు వారు ఎలాంటి వారో తెలుసుకోవచ్చునని అన్నారు.ఈ విషయాన్ని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు దృష్టికి తీసుకొని వెళ్లాలని పిల్లలకు తెలిపారు. 18 ఏళ్లలోపు బాలికలను లైంగికంగా వేధించినా, చిన్నారులపై అత్యాచారంతో పాటు మైనర్లపై దాడులకు పాల్పడే వారిపై, 16 ఏళ్లలోపు చిన్నారులపై లైంగిక దాడికిపాల్పడినా, అపహరించినా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుం టారని, బాల్య వివాహాలు, అఘాయిత్యలపై బాధితులు, గుర్తించిన వారు ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం చైల్డ్ లైన్ -1098, 100, 181 ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇస్తే అధికారులు సత్వరం స్పందించి పిల్లలకు రక్షణ కల్పిస్తారని తెలిపారు.మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చైతన్య మాట్లాడుతూ పిల్లలు లైంగిక దాడులకు గురి అయినప్పుడు వారి ఎదుగుదలపై మానసిక,శరీరకంగా చెడు ప్రభావము చూపుతుందని తెలిపారు. వారిలో ఆందోళన, భయం, మానసిక స్థితిలో మార్పులు, చెడు కలలు, ఏకాగ్రత పెట్టకపోవడము,లాంటి సమస్యలు ఉంటాయని వారిని గుర్తించి ఏలా కౌన్సెలింగ్ చేయాలో వివరించారు. డాక్టర్ శైలేశ్ కుమార్ మాట్లాడుతూ పుట్టిన శిశువు నుంచి 18 సంవత్సరములలోపు బాల బాలికలకు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించడం విటమిన్‌ల వలన లోపం వచ్చే వ్యాధుల గురించి, యవ్వన దశలో వచ్చే వ్యాధులను గుర్తించడం, పిల్లల్లో అవయవాల పెరుగుదల లోపించడ వంటి వ్యాధులను గుర్తించి వైద్యము అందిస్తారని తెలిపారు. ఈకార్యక్రమములో డిపిఎమ్ఓ డాక్టర్ ఉమా, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నిరుద్యోగలకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: 1998 సంవత్సరంలో డీఎస్సీ ఉత్తీర్ణులైనవారికిఉద్యోగ అవకాశాలు కల్పించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జిగాళ్ళ లింగన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అయిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1998 డీఎస్సీలో అర్హత సాధించి దాదాపు 27 సంవత్సరాలైనా నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం శోచనీయం వయోపరిమితి ఇప్పటికే చాలామందికి దాటిపోయినది మిగతా వారికైనా అవకాశం కల్పించి వారి యొక్క మనోవేదనను ఆర్థిక పరిస్థితిని మరి ఇతర కారణాలను ప్రభుత్వం వారు ఆలకించి వారికి త్వరగా ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిపోయిన 98 డీఎస్సీ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కూడా గత ఎన్నికలలో 98 డీఎస్సీ వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఉన్నారు. తక్కువ సమయంలో వారి కుటుంబాలకు వెలుగు నింపాలని ప్రైవేట్ పాఠశాలలో చాలి చాలని అరకోరా జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వారి పిల్లలు ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక స్తోమత లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. 98 డీఎస్సీ క్వాలిఫై అయిన నాటికి అప్పుడు తెలుగుదేశం గవర్నమెంట్ అధికారంలో ఉన్నది కాబట్టి అప్పటి జిల్లా ఆఫీసర్ల అనాలోచిత విధానం వలన ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగాలు రాక చాలా ఇబ్బందులు పడ్డారు కావున ప్రభుత్వం మరి శాసనసభ్యులు మంత్రులు అధికారులు అందరూ వీరిపైన కనికరించి వీరికి ఉద్యోగఅవకాశాలు కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గురురాజా స్కూల్ విద్యార్థి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కృష్ణా జిల్లా కంచికచర్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటిన గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈనెల 1, 2వ తేదీలలో కృష్ణాజిల్లా కంచికచర్ల లో 11వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. అండర్ - 14 సబ్ జూనియర్ విభాగంలో నంద్యాల గురురాజా పాఠశాల విద్యార్థి ఓజో రంగసాయి సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి ఓజో రంగ సాయిని పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి ఓజో రంగసాయి రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. మార్చి నెల 27, 28, 29 తేదీలలో ఒరిస్సాలోని కటక్ లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటి పాఠశాలకు నంద్యాల ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థి ఓజో రంగసాయి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చిన కోచ్‌ను అభినందించారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం : మునెప్ప

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు. ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నాకు నుద్దేశించి మునెప్ప మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగం, సామాజిక భద్రత, కార్మికులకు జీతాలు చెల్లింపు, మున్సిపల్ శాఖకు బాధ్యత అప్ప చెప్పాలని పర్మినెంట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డీఏ, అరియర్స్‌ను లీవ్ఎన్ క్యాష్ మెంట్ డబ్బులు చెల్లించాలన్నారు. కనీస వేతనం 36 వేలు రూపాయలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, చనిపోయిన మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తెలుగుదేశం, జనసేన ,బిజెపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార న్నారు. తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కారం కొరకు మున్సిపల్ శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వాధికారులు కార్మిక నాయకులను పిలిపించి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకపోతే ఆరో. తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాములు, అయ్యరాజు, ఏసన్న, సవారి, సంజీవులు, శేఖర్, భాస్కర్, లక్ష్మన్న, తిమ్మప్ప, అంజి, రాధ, ఏఐటీయూసీ నాయకులు ఆర్.కృష్ణారెడ్డి, మల్లన్న, రాము, నాగరాజు, పురుషోత్తం, మహిళా నాయకు రాలు రబిజాబీ, వెంకటేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీఎస్‌లో పని చేస్తున్న హొంగార్డులను ఏపీకి బదిలీ చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - కర్నూలు : తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హొంగార్డులను వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు బీసన్న, నగర నాయకులు సూర్య మధు, శ్రీనులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు చెందిన చెందిన వేలాదిమంది హొంగార్డులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగం పొంది, రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోవాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రం విడిపోయి 11 ఏళ్లు ఉన్న అన్ని శాఖల ఉద్యోగస్తులు ఏ రాష్ట్రానికి చెందినవారు ఆ రాష్ట్రానికి వచ్చినప్పటికీ హొంగార్డ్స్ మాత్రం చాలామంది తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోవలసి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వారు ఉద్యోగాలు తెలంగాణ రాష్ట్రంలో ఉండటంతో అసలే చాలీచాలని జీతాలతో జీవితం వెల్లదిస్తున్న హొంగార్డులకు సొంత రాష్ట్రానికి బదిలీ చేయక పోవడంతో తీవ్ర మానసిక శోభకు గురవుతున్నారన్నారు. పిల్లల చదువుల విషయంలో భవిష్యత్తులో స్థానికత సమస్య ఏర్పడుతుందని తీవ్ర ఆందోళనలో ఉన్నారని కావున రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం హొంగార్డులను ఆంధ్రప్రదేశ్ వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్లో ఉన్న తెలంగాణకు చెందిన హొంగార్డులను వారి స్థానిక రాష్ట్రాలకు బదిలీ చేయాలని వారు కోరారు.

మొక్కలు నాటిన కూటమి నాయకులు

విశాలాంధ్ర - వెలుగోడు : శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను వెలుగోడు పట్టణలో ఘనంగా నిర్వహించారు. వెలుగోడు మండల అధ్యక్షులు శేషిరెడ్డి, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ ఖలీల్, మాజీ సర్పంచ్ కలాం, మండ్ల శంకర్ రెడ్డి, డా జాకీర్ హుస్సేన్, సంజీవ రాయ ప్రసాద్, మెడికల్ స్టోర్ రాము, భూపాల్ చౌదరి, సూర్య నారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొని టిడిపి పార్టీ ఆఫీస్ నందు కేక్ కటింగ్ చేసి, ప్రజలకి మొక్కలు పంపిణీ చేశారు. ఎండిఓ ఆఫీస్ పరిధిలో అధికారులతోకలిసి నాయకులు మొక్కలు నాటారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఐటీడీపీ నాయకులు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో పేషంట్లకి, పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు.

రాష్ట్ర బడ్జెట్ పట్ల హర్షం

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్రంలో ప్రస్తుతం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారని నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓబీసీ అన్ని వర్గాల ప్రజలు అన్ని రంగాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా వ్యవ సాయం విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలు తోపాటు రాజధాని, ప్రజా సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టడం పట్ల చంద్ర బాబు పాలన అధ్యక్షత విజన్ అద్దం పట్టేలా కనిపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో టిఎన్టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహుడు, టీడీపీ నాయకులు వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దలాలయ్య, టైలర్ బాష, చోటు, కింగ్ హుస్సేన్, బాల దస్తగిరి, అబ్దుల్లా, కామిశెట్టి రమేష్, మోహన్, పిరయ్య, రసూల్, కశినేని ఓబులేసు, లక్ష్మణ్ నాయక్, నాగార్జున, రమణ, సురేంద్ర, మోహన్ కృష్ణ, వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ షూటింగ్ బాల్ విజేతలుగా..

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్రం నల్గొండ పట్టణంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు నిర్వహించిన సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్లు విజేతగా నిలిచాయి. సీనియర్ పురుషుల విభాగంలో విజేతలుగా, జూనియర్ బాలుర విభాగంలో బాలుర జట్టు విజేతలుగా నిలిచాయి. సబ్ జూనియర్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాయి. జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలువగా సబ్ జూనియర్ బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచాయి. అన్ని కేటగిరీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకా రులను ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు ప్రత్యేకంగా అభినందించారు. జట్టు విజయానికి కృషి చేసిన శిక్షకులు కిరణ్ కుమార్, మురళి, మహమ్మద్ యూసఫ్ బాష, మల్లికార్జున, హర్షవర్ధన్, సుజాత, సత్య, రేణుకలను ప్రత్యేకంగా అభినందించారు.